క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



యోగి

పాలకొండ రూరల్: పాలకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ సహాయ ఇంజినీర్‌గా ఎల్.యోగి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మందస నుంచి ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఏఈగా పనిచేసిన శ్యామ్ సుందర్‌కు విశాఖ జిల్లాకు బదిలీ జరిగింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం యోగి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల సమన్వయంతో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు.

చినుకు పడితే చిత్తడే..



నులకజోడు కూడలిలో ఏబీ రోడ్డు దుస్థితి

భామిని: మండలంలో బిల్లుమడ – నులకజోడు గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా తయారైంది. శుక్రవారం కురిసిన వర్షాలకు గోతులు బయటపడడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షానికి కూడా రహదారి చిత్తడిగా మారుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి మొత్తం గోతులతో నిండిపోవడంతో ఎలా రాకపోకలు సాగించాలని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.అధికారులు స్పందించి రహదారికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



బాలింత ఆరోగ్యంపై ఆరాతీస్తున్న డీసీహెచ్‌ఎస్ నాగభూషణరావు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి సీహెచ్‌సీ సేవలపై డీసీహెచ్‌ఎస్ జి.నాగభూషణరావు సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ ఆస్పత్రిని సందర్శించిన ఆయన..అదే ఆస్పత్రిలో గురువారం సర్జరీ ద్వారా బిడ్డకు జన్మనిచ్చిన బాలింతను కలిసి ఆరోగ్యంపై ఆరాతీశారు. తల్లీబిడ్డ ఆరోగ్యం ఎలా ఉందని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తొలిసారిగా ఆపరేషన్ చేసి డెలివరీ చేయడాన్ని అభినందించారు. ఇదే ఉత్సాహంతో పనిచేసి, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యులు డాక్టర్ ఆర్‌ఆర్‌కే చైతన్య, చంద్రవర్మ, రమ్య, పూర్ణ చంద్రిక, హెడ్‌నర్సు ఎం.రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

మురుగు కాలువ అనుకుంటే పొరపాటే..



పూర్తిగా రూపు కోల్పోయిన పోతులగెడ్డ ప్రధాన కాలువ

పాలకొండ రూరల్: చిత్రంలో కనిపిస్తున్నది మురుగు కాలువ అనుకుంటే పొరపాటే. ఇది పోతులగెడ్డ నుంచి సాగునీటిని పొలాలకు అందించే ప్రధాన కాలువ. వందలాది ఎకరాల సాగు భూమికి నీటి వనరైన ఈ కాలువ పూర్తిగా రూపు కోల్పోయింది. నిర్వహణకు నోచుకోకపోవడంతో పాటు కాలువకు ఓ పక్కనున్న వీరఘట్టం ప్రధాన రహదారి ఆక్రమణలకు గురికావటంతో దీని పూర్వపు స్థితిని కోల్పోయింది. మరోవైపు స్థానికులు చెత్త, వ్యర్థాలు పారబోయటంతో పాటు భారీగా పూడిక, పిచ్చిమొక్కల వల్ల నీరు ప్రవహించలేని స్థితికి చేరుకుంది. దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ కాలువను పునరుద్ధరిస్తే పాలకొండ పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్నవరం, అంపిలి గ్రామాలకు.. సమీప శ్రీకాకుళం జిల్లా బూర్జ మండల పరిధిలో కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతుందని రైతులు చెబుతున్నారు.

కూటమి మోసాలపై నిలదీద్దాం

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి



శిఖబడిలో జరిగిన సమావేశంలో కూటమి మోసాలపై మండిపడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను నిలదీయాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని శిఖబడి గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆమెకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని, కూటమి కుట్రలు, కక్షపూరిత పాలనపై మండిపడ్డారు. ప్రజాసంక్షేమం గాలికొదిలేసి కూటమి ప్రభుత్వం కక్షపూరిత పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. అధికారం కోసం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలు కన్నా రెండింతలు ఎక్కువ ఇస్తానని నమ్మబలికి, తీరా గెలిచాక పథకాల అమలు విస్మరిస్తుండడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో 14 నెలల కూటమి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎక్కడ చూసినా ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై దాడులు, అక్రమ కేసులు తప్ప ఏం సుపరిపాలన చేశారని ప్రశ్నించారు. ఎన్నికల హామీల్లో ఎన్ని అమలు చేశారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ పోరాడితేనే ఆ ఒకట్రెండు(గ్యాస్, తల్లికి వందనం) పథకాలైనా ప్రజలకు వచ్చాయన్నారు. ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాడకుంటే అవి కూడా ఎగ్గొట్టేందుకు చంద్రబాబు అండ్ కో ప్రయత్నించారని ధ్వజమెత్తారు. ఇటీవల ఆడబిడ్డ నిధి పథకంపై మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలే(ఆ పథకం ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలి) దీనికి నిదర్శనమన్నారు.

–అప్పట్లో ఏడాదిలోనే అన్ని పథకాలు..

వైఎస్సార్ సీపీ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేయడం జరిగిందని, ప్రతి వర్గానికి మేలు జరిగేలా కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా పథకాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరిగిందన్నారు. పేదలకు ఇస్తానన్న ఇళ్లు, 50 ఏళ్లకే బీసీలకు ఇస్తానన్న పింఛన్, మహిళలకు ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని, హామీలు అమలు చేసేదాకా ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, సంపత్‌కుమార్, నారాయణరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలపాలైన లక్ష్మణ

గరుగుబిల్లి: మండలంలోని ఎర్రన్నగుడి వై.జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లెల లక్ష్మణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. గరుగుబిల్లి మండలం, దళాయివలస పంచాయతీ, శివరాంపురానికి చెందిన లక్ష్మణ.. ఆగిపోయిన తన ఎక్స్‌ఎల్ మోపెడ్ ద్విచక్ర వాహనాన్ని నడిపించుకుని వెళ్తుండగా, వెనక నుంచి వచ్చిన ఓ వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో అతడి కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి అతడిని తరలించారు. ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు ఘటన స్థలాన్ని పరిశీలించి, జరిగిన దుర్ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అన్నదాత సుఖీభవ

పాలకొండ రూరల్: మండలంలోని కొండాపురంలో శనివారం ఉదయం పది గంటలకు అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ ఎ.డి కె. రత్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. పాలకొండ పరిధిలో 8,281 మందికి.. వీరఘట్టంలో 8,575 మందికి.. భామినిలో 6,173 మందికి.. సీతంపేటలో 9,417 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు.

తల్లిపాలే అమృతం..

పాలకొండ రూరల్:

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని సీడీపీఓ రంగలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తుమరాడ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ తంపటాపల్లి సూపర్‌వైజర్ ఎల్.శాంతికుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టాలన్నారు. కార్యక్రమంలో కె.సీతమ్మ, సంధ్యారాణి పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలో తల్లిపాల వారోత్సవాలు సీడీపీఓ సిమ్మాలమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

కుశిమి సెక్టార్ పరిధిలో అవగాహన ర్యాలీ చేపట్టి.. తల్లిపాలు అమృతంతో సమానమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సత్యవతి, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని కొమరాడ ఐసీడీఎస్ గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గొట్టివలస గ్రామంలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కల్పించారు. బిడ్డకు జన్మనిచ్చిన గంట వ్యవధిలో తల్లి ముర్రుపాలు అందివ్వాలని, అలాగే ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలే ఇవ్వాలని తెలిపారు.



సీతంపేట: ర్యాలీ చేస్తున్న తల్లులు



పాలకొండ రూరల్: తుమరాడలో తల్లిపాల వారోత్సవాలు చేపడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది



గరుగుబిల్లి: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లక్ష్మి

ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి



సీతంపేట: ప్రైవేట్ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పాలకొండ రూరల్: ప్రైవేట్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పట్టణ, గ్రామస్థాయిలో వైద్య సంబంధిత క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ, తదితరులు ప్రభుత్వ అనుమతులు కలిగి ఉండాలని తహసీల్దార్ రాధాకృష్ణ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రైవేట్ క్లినిక్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సరైన పత్రాల్లేని ఆరు క్లినిక్‌ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. పరిశీలనలో వైద్యాధికారి శివశంకర్, ఎస్సై కె.ప్రయోగమూర్తి, వీఆర్‌ఓ బంకి రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు..

సీతంపేట: మెడికల్ షాపులు, ప్రైవేట్ క్లినిక్‌లను పోలీస్, రెవెన్యూ, వైద్యశాఖ సిబ్బంది తనిఖీ చేశారు. ప్రభుత్వ అనుమతులున్న క్లినిక్‌లలో మాత్రమే ప్రాథమిక వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు, ఎస్సై వై.అమ్మన్నరావు, తదితరులు పాల్గొన్నారు.

చుక్కనీరు రావడం లేదు..



ఖాళీగా పరజపాడు సాగునీటి కాలువ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పరజపాడు సాగునీటి కాలువ ద్వారా చుక్కనీరు రావడం లేదని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ఆరంభమైనా సాగునీరు రాకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నారని ఎక్కడ ఏం పనులు చేస్తున్నారో అర్థం కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సాగునీరు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

వంగర: మండల పరిధి మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జంపా రాధిక శుక్రవారం తెలిపారు. 5వ తరగతిలో 44 సీట్లు, 6వ తరగతిలో 13 సీట్లు, 7వ తరగతిలో ఎనిమిది సీట్లు, 9వ తరగతిలో ఆరు సీట్లు ఖాళీలున్నాయని, అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బెల్ట్ దుకాణాలతో సంపద సృష్టి



పట్టణ శివారులోని ఓ బెల్ట్‌షాపు వద్ద ఖాళీ మద్యం బాటిళ్లు

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రైవేట్ మద్య పాలసీ అక్రమార్కులకు, సిండికేటుదారులకు సంపద సృష్టించే మార్గాలుగా మారాయి. పాలకొండ మండల, పట్టణ పరిధిలో ఏడు లైసెన్స్ దుకాణాలున్నాయి. అయితే ఆయా దుకాణాల పరిధిలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారు. ఇటీవల పలు గ్రామాల్లో బెల్ట్ దుకాణాలకు ఏకంగా వేలంపాటలు కూడా నిర్వహించడం విశేషం. మండల పరిధిలో సుమారు 60కి పైగా దుకాణాలు నిర్వహిస్తున్నట్లు అంచనా. ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ. 20 అదనంగా వేసి విక్రయిస్తున్నారు. అలాగే నాశిరకం మందు విక్రయిస్తూ మద్యంబాబులను దోచుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాలకొండ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని శక్తి టీమ్ ఏఎస్సై పి.సురేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక వెంకమ్మపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాము, గణపతి, గణేష్‌బాబు, భాస్కరరావు, హెచ్‌ఎం పరాంకుశంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జీవం పోసిన వరుణుడు



పాలకొండ - వీరఘట్టం రోడ్డుపై చేరిన వర్షపు నీరు

పాలకొండ రూరల్: సాగునీటి కాలువల ద్వారా నీరు అందక వరి పంట భూములు బీడువారి పోతున్న సమయంలో శుక్రవారం కురిసిన వర్షం వరినారుకు, వరి పంటకు జీవం పోసింది. మండల పరిధిలోని వెలగవాడ, పీఆర్ రాజుపేట, సిరికొండ, ఓని, తదితర గ్రామాలకు తోటపల్లి అనుసంధాన కాలువల ద్వారా నీరు అందకపోవడంతో దాదాపు రెండు వందల ఎకరాల్లో సాగు చేపట్టబోయే రైతులు నిరాశ చెందారు. ఈ సమయంలో కురిసిన వర్షం ఉభాలకు మేలు చేస్తుందని అన్నదాతలు చెబుతున్నారు. పాలకొండ - వీరఘట్టం రహదారి మీదుగా నీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.

తాగునీటి సదుపాయం కల్పనకు చర్యలు



గ్రామస్తుల తాగునీటి అవస్థలు తెలుసుకుంటున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాలేసుగూడకు సురక్షితమైన తాగునీటి సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇటీవల బాలేసుగూడ గ్రామస్తులు పడుతున్న తాగునీటి కష్టాలపై జూలై 31వ తేదీన 'సురక్షిత నీటిని అందివ్వండి' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ మేరకు ఏఈతో కలిసి సర్పంచ్ ఎం.కళావతి, పంచాయతీ కార్యదర్శులు గ్రామాన్ని సందర్శించి, అక్కడి తాగునీటి ట్యాంకును, ప్రజలు పడుతున్న తాగునీటి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. జల్ జీవన్ మిషన్ కింద గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించేందుకు రూ.11.90 లక్షలు మంజూరైందని, పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని, సంబంధిత కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం కూడా జరిగిందని అధికారులు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేసి మంచినీరు అందిస్తామన్నారు.

ప్రతిరోజూ కళాశాలకు వెళ్లాలి..



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ: వసతిగృహంలో చదువుతున్న విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు వెళ్లాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని బాలుర ఎస్టీ వసతిగృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వసతిగృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు.

మొండెంఖల్లులో పోలీసుల కార్డెన్ సెర్చ్



కొత్త వ్యక్తుల సంచారంపై వాకబు చేస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామంలో నీలకంఠాపురం ఎస్‌ఐ ఎన్.నీలకంఠారావు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ శుక్రవారం నిర్వహించారు. మావోయిస్టుల వారోత్సవాలు, ఉగ్రవాదుల సంచారం నేపథ్యంలో గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చారా లేనిదీ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అతడి నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలో సంచరిస్తున్నట్లు తెలిస్తే తమకు తెలియజేయాలని గ్రామస్తులకు తెలిపారు.

జ్వరాలపై అప్రమత్తం



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

భామిని: వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్ ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కె. విజయపార్వతి అన్నారు. మండలంలోని లోవగూడలో వైద్యాధికారి పసుపులేటి సోయల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. గ్రామంలో 109 మందికి పరీక్షలు నిర్వహించగా.. ఏడుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. గ్రామస్తులందరినీ పరీక్షించాలని ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూచించారు. కార్యక్రమంలో బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టం: పూజలందుకుంటున్న కోటదుర్గ

ఆలయాల్లో శ్రావణ శోభ



బత్తిలి: సంతోషిమాత ఆలయం వద్ద బారులుదీరిన భక్తులు



వీరఘట్టం: కోటదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

వీరఘట్టం:

మండల పరిధిలోని ఆలయాల్లో శుక్రవారం శ్రావణ శోభ కనిపించింది. రెండో శుక్రవారం సందర్భంగా మహిళా భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. మండల కేంద్రంలోని కోటదుర్గ, పైడితల్లి ఆలయాల్లో మహిళలు సామూహిక పూజలు చేశారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు.

బత్తిలిలో..

భామిని: మండలంలోని బత్తిలి సంతోషిమాత ఆలయం భక్తులతో కళకళలాడింది. వేకువజాము నుంచే మహిళా భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ చేశారు.